ఇంటికి చేరుకున్న **అదృశ్యమైన వ్యక్తి**

● రుద్రారం గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులకు అప్పగింత

7

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

● ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

6



బోయపల్లి శివారులో 70 శాతం పనులు పూర్తయిన మైనారిటీ గురుకుల భవన సముదాయం



మైనారిటీ గురుకులాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి(ఫైల్)

అద్దె తడిసి మోపెడు

● కిరాయి భవనాల్లో మైనారిటీ గురుకులాలు

● ఉమ్మడి జిల్లాలో 20 బాల, బాలికల విద్యాలయాలు

● నెలకు రూ.52 లక్షల అద్దె.. ఏడాదికి రూ.6.29 కోట్లు

● నాలుగేళ్లుగా నిర్మాణంలోనే భవనాలు

● బోయపల్లి సమీపంలో 70 శాతం పనులు పూర్తి

● అక్టోబరులో ప్రారంభించేందుకు కసరత్తు

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మైనారిటీ గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో ప్రభుత్వానికి రెంటు భారం తడిసిమోపెడవుతోంది. మైనారిటీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మైనారిటీ గురుకులాలను ప్రారంభించింది. 5వ తరగతి నుంచి పదో తరగతి వరకు, ఆ తర్వాత ఇంటర్ వరకు కొన్ని పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మొత్తం బాల, బాలికల గురుకులాలు 20 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారుగా 10 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ గురుకులాలన్నీ అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. నెలకు వీటి అద్దె రూపంలో రూ.52.43 లక్షలను చెల్లిస్తున్నారు. సొంత భవనాలకు ప్రభుత్వం స్థలం కేటాయించి నిధులు విడుదల చేసినా అవి నాలుగైదు సంవత్సరాలుగా నిర్మాణంలోనే ఉన్నాయి. దాంతో ప్రభుత్వానికి ఏడాదికి రూ.6.29 కోట్లు అద్దెల రూపంలో భారం పడుతోంది.

కొనసా..గుతున్న నిర్మాణాలు

ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్ జిల్లాకు 6 మైనారిటీ గురుకులాల భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం 2016లో ఆదేశాలు జారీ చేసింది. ఒక్కో గురుకులానికి రూ.20 కోట్ల చొప్పున రూ.120 కోట్లు మంజూరు చేసింది. బోయపల్లి శివారులో బాలికల గురుకుల భవన నిర్మాణానికి 5 ఎకరాల ప్రభుత్వ స్థలంలో 2019లో పనులు ప్రారంభించారు. ఈ భవనం పనులు 70 శాతానికిపైగానే పూర్తయ్యాయి. వీరన్నపేట డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీ వద్ద 2 బాలికలు, 3 బాలుర గురుకుల పాఠశాలల భవనాలకు 15 ఎకరాల స్థలం కేటాయించి 2022లో పనులు మొదలు పెట్టారు. ఈ 5 భవనాల నిర్మాణ పనులు పిల్లర్ల వరకు చేపట్టి,

(మిగతా 6లో..)

త్వరలో బోయపల్లి గురుకులం ప్రారంభిస్తాం..



జిల్లా కేంద్రంలోని బోయపల్లి వద్ద నిర్మిస్తున్న బాలికల గురుకుల భవనం పనులు తుది దశకు చేరుకున్నాయి. మరో 5 నెలల్లో భవనంలో అందుబాటులోకి వస్తుంది. అక్టోబరు 15లోగా రెండు పాఠశాలలు, ఒక జూనియర్ కళాశాలలో తరగతులు ప్రారంభించాలని ఆలోచిస్తున్నాం. ఇప్పటికే కలెక్టర్ పనులు పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇవి అందుబాటులోకి వస్తే అద్దె భారం తగ్గుతుంది.

-శంకరాచారి, జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి

తెలంగాణ అంటేనే.. బతుకమ్మ

● సంప్రదాయాలు ఉట్టిపడేలా సంబురాలు

● ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

● ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో వేడుకలు



బతుకమ్మతో విద్యార్థిని

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



ఎన్‌టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల వద్ద బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అంటేనే బతుకమ్మఅని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు సంబురాల్లో పాల్గొని, విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదివారం నుంచి రాష్ట్రంలో బతుకమ్మ వేడుకలను అంబరాన్ని తాకేలా నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ నైపుణ్య శిక్షణ తీసుకున్న మహిళలకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహరెడ్డి, రాష్ట్ర నాయకులు ఎన్‌పీ వెంకటేష్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, ఎన్ఎస్‌యూఐ నాయకులు రమేష్, శివ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు

నేటి నుంచి సంబురాలు

● రోజూ వివిధ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించాలి: కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బతుకమ్మ సంబురాలను జిల్లాలో ఆదివారం నుంచి నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో వేడుకలను నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తొమ్మిది రోజుల పాటు మహిళా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు 16 మండల కేంద్రాల్లో బతుకమ్మ ఆడనున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే సంబురాల్లో 80 శాఖలు పాల్గొననున్నాయి. 29న చివరి రోజు సద్దుల బతుకమ్మను ఊరేగింపుగా మయూరి పార్క్ సమీపంలోని గన్నీజీ కుంటలో నిమజ్జనం చేయనున్నారు.

నేటి నుంచి దసరా సెలవులు

● ఇంటిబాట పట్టిన విద్యార్థులు

● పాఠశాలల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

● సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవు: విద్యాశాఖ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/నారాయణపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థలకు ఆదివారం నుంచి అక్టోబరు 3 వరకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. దాంతో గురుకులాలు, కేజీబీవీలు, సాంఘిక సం క్షేమ హాస్టళ్లు, ప్రైవేటు హాస్టళ్లలో ఉం టున్న విద్యార్థులు ఇంటి బాట పట్టారు. విద్యార్థులు తల్లిదండ్రులు, సంరక్షకులతో కలిసి ఇళ్లకు వెళ్లారు. దాంతో మహబూబ్‌నగర్, నారాయణపేట బస్టాండ్లు సందడిగా మారాయి.

తల్లిదండ్రుల సమావేశాలు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న బోధన, నాణ్యమైన భోజనం, వసతుల గురించి ప్రధానోపాధ్యాయులు వివరించారు. విద్యార్థులను ఇంటి దగ్గర బాగా చదివించాలని చెప్పారు.

పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు

బతుకమ్మ సంబరాలు ఒక రోజు ముందుగానే పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో వచ్చిన విద్యార్థినులు వివిధ రకాల పూలతో తయారు చేసిన బతుకమ్మలతో ఆటపాటలు ఆడారు. దాంతో విద్యా సంస్థల వద్ద సందడి నెలకొంది.



విద్యార్థులు, ప్రయాణికులతో కిటకిటలాడుతున్న నారాయణపేట బస్టాండ్



బస్సు ఎక్కడానికి గుమిగూడిన విద్యార్థులు



నారాయణపేట గురుకుల పాఠశాల నుంచి ఆనందంగా సొంత ఊళ్లకు వెళ్తున్న విద్యార్థులు

బాధితులకు న్యాయం జరగాలి

● కోర్టు డ్యూటీ అధికారులు, లైజన్ అధికారులు సమన్వయంతో పని చేయాలి

● అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం



సమావేశంలో మాట్లాడుతున్న రత్నం

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన నేరస్థులకు శిక్ష పడటంతోపాటు బాధితులకు న్యాయం జరగాలని అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో శనివారం కోర్టు డ్యూటీ అధికారులు, లైజన్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాక్షులను సమయానికి కోర్టుల్లో హాజరు పరచాలని చెప్పారు. కోర్టు డ్యూటీ అధికారులు, లైజన్ అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్ కేసులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రతీ ఒక్కరు తమ వంతు కృషి చేయాలన్నారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మగ్దూమ్‌అలీ, కోర్టు లైజన్ అధికారులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉపయోగపడేలా గొర్రెల సంత

● జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



గొర్రెను కొనుగోలు చేసి, డబ్బులు అందిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానికులకు, వ్యాపారులకు, గొర్రెలు, మేకల పెంపకం దారులకు ఉపయోగపడేలా గొర్రెలు, మేకల క్రయ, విక్రయాల సంతను ప్రారంభించడం సంతోషకరమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల మునిసిపాలిటీ కావేరమ్మపేట సంత బజారులో శనివారం గొర్రెలు, మేకల సంతను ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. గొర్రెలు, మేకలు కొనడానికి, అమ్మడానికి ఉమ్మడి జిల్లాలోని ఇతర సంతలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండకూడదనే ఈ సంతను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గొర్రెల పెంపకందారుడితో గొర్రెను కొనుగోలు చేసి, దానిని మునిసిపాలిటీ కార్మికులకు అందజేశారు.

పిచ్చికుక్క స్వైర విహారం

● 14 మందికి కాటు

● వృద్ధుడికి తీవ్ర గాయాలు



పిచ్చికుక్క దాడిలో గాయపడ్డ వృద్ధుడు మాసయ్య

జడ్చర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేట సంత వద్ద శనివారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. సంతకు వచ్చిన వారితో పాటు అటుగా వెళ్తున్న 14 మందిని కరిచింది. అందులో కావేరమ్మపేటకు చెందిన మాసయ్య కాలుకు, మణిదీప్ అనే బాలుడిని పిచ్చికుక్క తీవ్రంగా గాయపరిచింది. కుక్కకాటుకు గురైన 14 మంది జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలివెళ్లారు. ఇందులో మాసయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయం కావడంతో 108 అంబులెన్స్‌లో జిల్లా జనరల్ ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. జడ్చర్ల మునిసిపాలిటీలో గుంపులు, గుంపులుగా తిరుగుతున్న కుక్కల బెడద నుంచి కాపాడాలంటూ పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆటో.. ఇటో

ఆటో డ్రైవర్లు ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రమాదకరంగా పరిమితికి మించి ఎక్కించుకుని భయబ్రాంతులకు గురి చేస్తున్నారు. రైతులు ప్రస్తుతం పత్తి తీసే పనులు చేపడుతున్నారు. కూలీలను తీసుకొస్తే రైతులు ఇచ్చే కమిషన్‌కు ఆశపడుతున్న ఆటో డ్రైవర్లు ఆటోలలో 20 నుంచి 25 మందిని ఎక్కించుకుని వెళ్తున్నారు. టాప్‌పైన కూడా ఎక్కించుకుంటున్నారు. ఏ మాత్రం అదుపు తప్పినా కూలీల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల గతంలో ఎన్ని ప్రమాదాలు జరిగినా వారికి కనువిప్పు కలగడం లేదు. నర్వ మండలం రాయికోడ్ నుంచి కూలీలతో వెళ్తున్న ఆటోను 'ఆంధ్రజ్యోతి' శనివారం సాయంత్రం క్లిక్ మనిపించింది.

- నర్వ, ఆంధ్రజ్యోతి



హైదరాబాద్‌కు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సు

దసరాకు 641 ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రయాణికులకు దసరా పండుగ సందర్భంగా 641 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్ఎం సంతోష్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ నెల 20 నుంచి అక్టోబరు 2 వరకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వాటిని నడుపనున్నట్లు చెప్పారు. అచ్చంపేట డిపో నుంచి 60 ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు. గద్వాల డిపో నుంచి 86, కల్వకుర్తి నుంచి 60, కొల్లాపూర్ నుంచి 50, మహబూబ్‌నగర్ నుంచి 93, నాగర్‌కర్నూల్ నుంచి 53, నారాయణపేట నుంచి 86, షాద్‌నగర్ నుంచి 67, వనపర్తి నుంచి 86 బస్సులు అదనంగా నడుపుతామన్నారు. సెలవుల సందర్భంగా ప్రయాణికులు అధిక సంఖ్యలో సొంత ఊళ్లకు వెళ్తారని, అందుకే అదనపు బస్సులను నడుపనున్నామని అన్నారు. బస్సుల కోసం బస్టాండ్లలో నిరీక్షించే ప్రయాణికుల అదనపు వలంటీర్లను ఏర్పాటు చేస్తామని, తాగునీటి వసతి, కుర్చీలు వంటి సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

అద్దె తడిసి మోపెడు



వీరన్నపేట డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీ వద్ద పిల్లర్ల వరకు వేసి వదిలేసిన ఐదు గురుకులాల సముదాయం

(5వ పేజీ తరువాయి)

వదిలేశారు. అదేవిధంగా జడ్చర్లలో ఒకటి, దేవరకద్రలో 2 గురుకులాల నిర్మాణానికి స్థలాలు కేటాయించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తిలో ఒక్కో గురుకులం, వనపర్తి-2, గద్వాల, నారాయణపేట జిల్లాల్లో ఒక్కో భవనానికి స్థలాలు కేటాయించారు. పనులు ఎప్పుడు మొదలు పెడతారో తెలియని పరిస్థితి ఏర్పడింది.

అద్దెలు చెల్లించలేదని తాళాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 మైనారిటీ గురుకులాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గత ఏడాది అక్టోబరు వరకు 11 నెలల అద్దె పేరుకపోవడంతో యజమానులు పలు చోట్ల భవనాలకు తాళాలు వేశారు. జిల్లా కేంద్రం న్యూటౌన్‌లో ఉన్న మైనారిటీ బాలుర-2 గురుకులంతో పాటు పలు గురుకులాలకు తాళాలు వేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు.

స్నాతకోత్సవాల్లో పాల్గొనాలని గవర్నర్‌కు ఆహ్వానం



రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆహ్వానిస్తున్న పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పాలమూరు విశ్వవిద్యాలయంలో వచ్చే నెల 16న జరిగే నాలుగవ స్నాతకోత్సవాలకు పాల్గొనవలసిందిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం రాజ్‌భవన్‌లో పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ జీఎన్. శ్రీనివాస్, పాలమూరు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ పి.రమేష్‌బాబు, పాలయూరు యూనివర్సిటీ పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. మధుసూదన్‌రెడ్డి గవర్నర్ ను కలిశారు. అలాగే, స్నాతకోత్సవాలకు రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి విద్యాశాఖ ఎం.హరితను కూడా వారు కలిసి ఆహ్వానించారు.

ఐరన్ పరిశ్రమ కాలుష్యంపై అధికారుల విచారణ



పరిశ్రమ విడుదల చేసిన కాలుష్యకారక నీటిని పరిశీలిస్తున్న అధికారులు

బాలానగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ మండలంలోని పెద్దాయపల్లి గ్రామ పంచాయతీ శివారులో గల హరిఓం ఐరన్ పరిశ్రమ కాలుష్య కారక నీటిని పొలాల్లోకి విడుదల చేస్తుంది. దీంతో సమీపంలోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత నాలుగు రోజుల క్రితం గ్రామానికి చెందిన రైతులు రాజేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, సత్తయ్యగౌడ్‌లు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం ఉదయం కాలుష్యం నియంత్రణ మండలి ముఖ్య అధికారి సురేష్, బాబు రాష్ట్ర ఎన్విరాన్మెంట్ అసిస్టెంట్ ఇంజనీరింగ్ సైంటిస్టులు విద్యుత్ లత సంఘటన స్థలానికి చేరుకొని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అలాగే రైతు పొలాలలో ఉన్న కాలుష్యకారక నీటికి సంబంధించిన శ్యాంపిల్‌లను సేకరించారు. తాము సేకరించిన ఈ నీటిని హైదరాబాద్‌లోని పరిశోధన కేంద్రంలో పరీక్షలు నిర్వహించి ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

దిగువ జూరాల కేంద్రంలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో విద్యుత్‌ను నిలిపినట్లు ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పతి కేంద్రాల ఎస్‌ఈ శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎగువ నుంచి భారీ స్థాయిలో వరద వస్తున్న కారణంగా నది ద్వారా అధికంగా నీటిని విడుదల చేస్తుండడంతో దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో విద్యుత్తును నిలిపివేసినట్లు ఆయన తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో 6 యూనిట్లను ప్రారంభించి 3.220మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్పటివరకు 349.048 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు ఆయన తెలిపారు. అలాగే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో 370.154 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని రాబట్టినట్లు ఆయన తెలిపారు. వరద తగ్గుముఖం పట్టగానే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఉత్పత్తిని చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

నష్టపరిహారం అందేలా చూడాలి



కోర్టు బయట ఉన్న బాధితులు

గద్వాల క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని గార్లపాడు ముంపుగ్రామంలో ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం సీనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టు నుంచి అందేలా చూడాలని బాధితులు కోర్టు ఆవరణకు చేరుకున్నారు. ఇందుకు సంబంధించి బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలో ఉన్న మా ఇళ్లు పూర్తిగా ముంపునకు గురయ్యాయని, అయితే వాటి నష్టపరిహారానికి సంబంధించి కోర్టులో పెండింగ్ ఉన్నదని వెంటనే నష్టపరిహారం అందేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.

కూలి రేట్లతో అల్లాడుతున్న పత్తి రైతులు

- కేజీ పత్తి తీతకు రూ.18
- వర్షాలతో పెరిగిన రేట్లు
- పంటలో సగం డబ్బులు కూలీలకే
- దూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న కూలీలు



పొలంలో విరగకాసిన పత్తి

వడ్డేపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంటలు దిగుబడి వచ్చేసరికి కూలి రేట్లు పెరగడంతో రైతులు అల్లాడిపోతున్నారు. పంట చేతికి వచ్చినప్పటి నుంచి వర్షాలు కురుస్తుండటంతో కాసిన పత్తి నల్లబారిపోతున్నది. పత్తి నల్లబడటంతో ఒక కేజీ పత్తి తీయడానికి రూ.18 నుంచి రూ.20ల వరకు కూలి రేట్లు చెల్లించి రైతులు తీయిస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో కూలీల డిమాండ్ బాగా పెరిగిపోయింది. దీంతో దూర ప్రాంతాలైన కర్నూలు, రాయచూర్, కొత్తకోట, పెబ్బేరు, కొల్లాపూర్ నుంచి కూలీలు వాహనాల్లో ఇక్కడి ప్రాంతాలకు వస్తున్నారు. పత్తిని తీయించాలనే ఉద్దేశంతో రైతులు పోటీపడి కూలీ రేట్లు పెంచేయడంతో కొందరు రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని కూలీలు రేట్లను పెంచేస్తున్నారు. జిల్లాలో 1,50,000 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. కాగా, వర్షాల వల్ల 50శాతం పంటలు రై తులు నష్టపోయారు. ఈ క్రమంలో చేతికి వచ్చిన పంటను తీసుకుందామంటే కూలీ రేట్లు పెరగడంతో రైతులు అయోమయంలో పడ్డారు. కనీసం తీసిన పత్తిని మార్కెట్‌కు తీసుకువెళితే క్వింటాలు రూ.6వేల నుంచి రూ.7వేల దాకా పోతుంది. ఇందులో పెట్టుబడులు కాదని కూలీలకే రూ.2వేలు ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కూలీలకు పిలిస్తే రోజుకూ రూ. 250లు ఇవ్వాల్సి ఉండగా రూ.450లు అడుగుతు న్నారు. మరికొందరు రైతులు తప్పని పరిస్థితిలో రూ.450లు చెల్లించి పొలంలో పత్తి పంటను తీయిస్తున్నారు. పంటను పొలంలో వదిలిపెట్టలేక అధిక కూలీలు చెల్లించి పంటలను తీసుకుంటున్నారు. కనీసం వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టపరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఒక కేజీ పత్తి తీతకు రూ.20లు అడుగుతున్నారు



రోజూ మేఘాలు కమ్ముకోవడంతో పత్తి దెబ్బతింటుందనే ఉద్దేశంతో ఒక కేజీకి రూ. 20లు కూలి అడుగుతుండగా రూ.16లు ఇచ్చి తీయిస్తున్నాం. ఒక క్వింటాకు కూలీలకు రూ.1600 నుంచి రూ.2వేల దాకా ఖర్చు అవుతుంది. రైతులు పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. ఒకపక్క వర్షాలు, మరోపక్క కూలీల రేట్లతో ఇబ్బందులు పడుతున్నాం. ఇలా ఉంటే రైతులు పంటలు పండించడం చాలా కష్టం. కనీసం దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించి ప్రభుత్వం ఆదుకోవాలి.

\- పాపన్న, రైతు

కూలీలు దొరకడం లేదు



పొలంలో పత్తి పగిలినప్పటికీ కూలీలు దొరకడం లేదు. రోజువారి కూలీలకు రాకుండా కేజీల ప్రకారం తీసేందుకు వస్తామని కూలీలు చెబుతున్నారు. గత సంవత్సరం కేజీ రూ.12లు ఉండగా ప్రస్తుతం రూ.20లకు చేరుకుంది. ఏడు ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాను. రూ.2.50లక్షలు పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల పండిన పత్తి పంట నాశనం అవుతుంది. వర్షాలకు భయపడి ఎంత కూలి రేటైనా చెల్లించాల్సి వస్తుంది. నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

\- ఆంజనేయులు, రైతు

స్వచ్ఛభారత్‌తోనే పరిసరాల పరిశుభ్రత

- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి



కల్వకుర్తి బస్టాండ్‌లో స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

కల్వకుర్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ భారత్‌తోనే పరిసరాల పరిశుభ్రత సాధ్యమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవాపక్షంలో భాగంగా కల్వకుర్తి పట్టణంలో కల్వకుర్తి పట్టణ అధ్యక్షుడు గన్నోజు బాబీదేవ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి హాజరై బీజేపీ కార్యకర్తలతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి మాట్లాడుతూ సుమారు 9 సంవత్సరాల క్రితం భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అక్టోబరు 2 గాంధీ జయంతి రోజున భారతదేశంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని మొదలుపెట్టారని తెలిపారు. స్వచ్ఛభారత్‌లో ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబరు మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు బోడ నరసింహ, జిల్లా కార్యదర్శి గుర్రాల రాంభూపాల్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్యామ్, సీనియర్ నాయకులు సూర్యకృష్ణగౌడ్, నరెడ్ల శేఖర్‌రెడ్డి, పాలకూరల రవిగౌడ్, సురేందర్‌గౌడ్, లింగారెడ్డి, బీజేవైఎం చంద ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండోజు గంగాధర్, జిల్లా కౌన్సిల్ మెంబరు బ్బంగి వివేకానందరెడ్డి, నర్సిరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నాప శివ, మండల ప్రధాన కార్యదర్శి తగుళ్ల వెంకటేశ్‌యాదవ్, పట్టణ కోశాధికారి లక్ష్మీనరసింహ, మర్రిపల్లి సురేష్‌యాదవ్, అరవిందొరెడ్డి, పురం మహేష్‌రెడ్డి, వాకిటి శ్రీకాంత్, పానుగంటి మల్లేష్‌గౌడ్, కార్యకర్తలు, నాయకులు, మునిసిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు విద్యార్థుల ఎంపిక



జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

మక్తల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట స్కూల్‌గేమ్స్ 14, 17ఏళ్ల విభాగంలో మక్తల్ మినీ స్టేడియంలో నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్‌శెట్టి తెలిపారు. జిల్లా జట్టు కెప్టెన్‌గా చంద్ర, సిద్ధర్థరాజ్, జగదీష్, తేజ, సల్మాన్, అధినాష్, నాగచైతన్య, యువరాజ్, సాయిహర్షిత్, చరణ్, ప్రజ్వల్, ఓం సరోదేలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. 17ఏళ్ల విభాగంలో మణివర్ధన్, షేక్ మొహ్మద్, అతిక్రం, మహేష్, బాలక్రిష్ణ, జగన్నాయక్, అథితి, శ్రీకాంత్, రాంచరణ్, జలంధర్, భానుశంకర్, సాయిబద్రి, మొహ్మద్ ఒబేద్, నవీన్, శివంతేల్కర్‌లు ఎంపికైనట్లు తెలిపారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా

- ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డ డ్రైవర్



బోల్తాపడిన వాటర్ ట్యాంకర్

తెలకపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలో శనివారం వాటర్ ట్యాంకర్ బోల్తా పడగా, డ్రైవర్ ప్రాణాలతో బయటపడిన సంఘటన చోటుచేసుకున్నది. మండల కేంద్రానికి చెందిన వాటర్ ట్యాంకర్‌లో నీళ్లు తీసుకొని వస్తుండగా, అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎలాంటి ప్రమాదం లేకుండా డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ట్రాక్టర్లు అతివేగంగా రావడమే ఇలాంటి ప్రమాదకరమైన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని, వేగాన్ని నియంత్రించడానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

- ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్



ఆసుపత్రుల్లోని మందుల దుకాణాలలో తనిఖీలు చేస్తున్న ఏడీ

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రుల్లోని ఫార్మసీలలో నిబంధనలు పాటించని యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల, గద్వాలలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో గల ఫార్మసీలలో ఆయనతో పాటు ఆయా జిల్లాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా వరకు మెడికల్ దుకాణాలు నిబంధనలు పాటించడం లేదని, శాంపిల్ మందులతో పాటు అనుమతి లేని డ్రగ్స్ కూడా విక్రయిస్తున్నారని, రికార్డులు సరిగ్గా నిర్వహించడం లేదని ఫిర్యాదులు చాలా వస్తున్నాయన్నారు. వాటి ఆధారంగా ఈ తనిఖీలు చేసి నిబంధనలు పాటించని కొన్ని మెడికల్ దుకాణాలకు షోకాజు నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. ఆయా యాజమాన్యాలు ఇచ్చే సమాధానంపై తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్రగ్ కంట్రోల్ యాక్ట్‌కు అనుగుణంగా నడుచుకోలేని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో మహబూబ్‌నగర్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విశ్వంత్‌రెడ్డి, జడ్చర్ల మహ్మద్ రఫీ షేక్, గద్వాల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ ఆశయాలు కొనసాగిస్తా

- రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజిని



అమరచింతలో సాయిచంద్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న రజిని

అమరచింత, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాయిచంద్ మన మధ్యన లేనప్పటికీ ఆయన ఆశయాలను కొనసాగిస్తానని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్పర్సన్ రజిని పేర్కొన్నారు. సాయిచంద్ జయంతి సందర్భంగా శనివారం రాత్రి అమరచింతలో ఆయన విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో తన గలంతో ప్రజలను ఐక్యం చేసి ప్రత్యేక రాష్ట్రం కోసం ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్‌ఏ రాజు, నర్సింహులు గౌడ్, చిన్న బాలరాజు, లెనిన్, డీజే శేఖర్, అబ్రహం, పట్నం సూరి, గోపాల్, రమేష్, రఘు, దాసరి పురుషోత్తం, కిరణ్, నబి, జలందర్ నజీర్, మన్నాన్ పాల్గొన్నారు.

నేడు అండర్-19 ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జనగామలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించున్న రాష్ట్రస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలుర జట్టు ఎంపికలను ఆదివారం స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు జిల్లా స్టేడియంలో మైదానంలో కళాశాల బోనఫైడ్, ఆధార్ కార్డు, పదో తరగతి మెమో జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

రేపు ఉమ్మడి జిల్లా ఉషూ జట్ల ఎంపికలు

రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14,17, 19 ఉషూ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల,బాలికల జట్ల ఎంపికలను ఈ నెల 22న ఉదయం 9 గంటలకు స్టేడి యం మైదానంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ శారాదాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల, స్కూల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

జిల్లా కీర్తిని చాటాలి

- ప్రధానోపాధ్యాయుడు జహీరుద్దీన్



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులతో ప్రధానోపాధ్యాయుడు, ఫిజికల్ డైరెక్టర్

గద్వాల అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీల్లో మంచి ఆటతీరును కనబరచి జిల్లా పేరును సార్థకం చేయాలని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జహీరుద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ స్రవంతి అన్నారు. శనివారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన ఎనిమిది మంది క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 24 మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాలి

- డీఎఫ్‌ఏ అధ్యక్షుడు బండల వెంకట్రాములు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎఫ్‌ఏ అధ్యక్షుడు బండల వెంకట్రాములు

గద్వాల అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా అసోసియేషన్ క్రీడాకారులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో పోటీల్లో రాణించాలని అసోసియేషన్ అధ్యక్షుడు బండల వెంకట్రాములు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సోమనాద్రి ఫుట్‌బాల్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సీనియర్స్ ఫుట్‌బాల్ ఎంపిక పోటీలకు ఆయన హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. క్రీడాకారులు సమిష్టిగా రాణించి జట్టు విజయానికి దోహదపడాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో పోటీల్లో విజయం సాధించి అందరి మన్నలను పొందాలన్నారు. డీఎఫ్‌ఏ కార్యదర్శి విజయ్, ప్రవీణ్ సేవా సమితి అధ్యక్షుడు ఇండికా శివ, గోవర్ధన్ రెడ్డి, పాండు, చక్రా, శ్యామ్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనార్టీలకు ప్రవేశపెట్టిన పథకల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శంకరాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన పథకం ద్వారా నిరాశ్రయులు, వితంతువులు, విడాకులు పొందిన, అనాథలు, అవివాహిత మహిళలకు చిన్న వ్యాపారం కోసం ఒక్కొక్కరికి రూ. 50వేల సాయం, రేవంతన్నకా-సహారా మిస్కినోకే లియే పథకం ద్వారా ఫకీర్, దుదేకుల, దుర్బల ముస్లిం సమాజ వర్గాలకు మోపెడ్ వాహనాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష గ్రాంట్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగి మైనారిటీ మహిళలు, ఫకీర్, దుదేకుల వారు టీజీఓబీఎంఎంఎస్. సీజీజీ, జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా అక్టోబరు 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పశువులను కబేళాకు తరలిస్తున్న నిందితుల రిమాండ్

ఊర్కొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్‌ఐ లచ్చినాయక్ తెలిపారు. ఏఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పార్వతిపురం నుంచి హైదరాబాద్ కబేళాకు 25 ఆవులు, కోడెదూడలు 46లను కంటైనర్‌లో ఎలాంటి రశీదులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారు.

ఈ క్రమంలో ఊర్కొండ మండలంలోని ఇప్పపహాడ్ శివారులో పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసిన సంఘటన పాఠకులకు విదితమే. పట్టుబడిన కంటైనర్ డ్రైవర్ హర్యానకు చెందిన షకీల్, ఆంధ్రప్రదేశ్‌లోని నక్కపల్లికి చెందిన దుర్గా, లవరాజులను రిమాండ్ తరలించామని, అప్పలరాజు తప్పించుకున్నట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

క్రైం కార్నర్

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం.. వ్యక్తి మృతి

కొత్తకోట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మలుపులో ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో శనివారం చోటు చేసుకుంది. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన గట్టన్న (52) పెబ్బేర్ నుంచి సొంత గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా నాటవెల్లి గ్రామ సమీపంలో ఉన్న రోడ్డు మలుపులో వాహనం రోడ్డు కిందకు దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన గట్టన్నను రోడ్డు వెంట వెళ్తున్న వాహనదారులు గమనించి 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. అప్పటికే మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచాం ఇచారు. కుటుంబ సభ్యుల ఫిరాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

రాజోలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పండుగకు కూతురుని పుట్టింటికి తీసుకురావడానికి వెళ్లిన వ్యక్తి రైలు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ ఘటన హైదరాబాద్ శివారులోని ఉందానగర్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజోలికి చెందిన కుర్వ మల్లయ్య (55) అనే వ్యక్తి వ్యవసాయం, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

పండుగ సందర్భంగా హైదరాబాద్ శివారులోని బుద్వేల్‌లో నివాసం ఉంటున్న కూతురుని పండుగకు తీసుకువచ్చేందుకు శుక్రవారం మధ్యాహ్నం రాజోలి నుంచి బయలుదేరాడు. సాయంత్రం 7గంటలకు ఉందానగర్ సమీపంలో రైలు దిగే క్రమంలో అదుపు తప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే శాఖ అధికారులు ప్రమాద సంఘటనను పరిశీలించి కుటంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సంఘటన విన్న మృతుడి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వంగూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వంగూరు మండలంలోని హైదరాబాదు-శ్రీశైలం ప్రధాన రహదారిలోని సర్వారెడ్డిపల్లి తండా గేటు సమీపంలో శనివారం బైక్ అదుపు తప్పి బోల్తాపడి ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే నల్లగొండ జిల్లా చౌటుప్పల్‌కు చెందిన సాయినాథ్, విష్ణులు బైక్‌పై శ్రీశైలం వెళుతుండగా సర్వారెడ్డిపల్లితండా గేటు మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడి గాయపడ్డారు. 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి



సంఘటనా స్థలంలో గేదెల మృతదేహాలు

ఎర్రవల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి రెండు గేదెలు సంఘటన స్థలంలోనే మృతి చెందాయి. ఎర్రవల్లి మండల పరిధిలోని శేకుపల్లి గ్రామ శివారులో శనివారం ఎర్రవల్లికి చెందిన గొల్లరాజు తన పది గేదెలను మేతకు తీసుకెళ్లాడు. గేదెలు మేత మేస్తున్న తరుణంలో ఎల్‌టీ విద్యుత్ తీగ తెగి కిందపడటంతో రెండు గేదెలకు తగిలి షార్ట్‌సర్క్యూట్‌తో మరణించాయి. ఈ రెండింటి విలువ సుమారు రెండు లక్షలకు పైగా ఉంటుందని బాధితుడు తెలిపారు.

సీజ్ చేసిన ఇసుకనూ వదల్లేదు..

▸▸ ఎత్తుకెళ్లిన వ్యక్తులపై కేసు నమోదు

చిన్నచింతకుంట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీజ్ చేసిన ఇసుక డంపును ఎత్తుకెళ్లిన వ్యక్తులపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. చిన్నచింతకుంట ఎస్ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... తిరుమలాపురం గ్రామ శివారులో సర్వే నెంబరు 101లో ఈనెల 17న కౌకుంట్ల మండల తహసీల్దార్, ఆర్ఐలు కలిసి ఇసుక డంపును సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను ముచ్చింతల గ్రామ రెవెన్యూ సహాయకుల ఆధీనంలో ఉంచగా, ఇసుక డంప్‌నకు కాపలాగా ఉన్నా కానీ 18న తెల్లవారు జామున సుమారు 3 గంటల సమయంలో టిప్పర్, జేసీబీ సహాయంతో ఇసుకను నింపుతుండగా, గమనించిన వీఆర్ఏలు ఆపేందుకు ప్రయత్నించారు. అయినా ఇసుక నింపుకొని వారు పరారయ్యారు. కౌకుంట్ల ఆర్ఐ ఖదీర్ పాషా తిరుమలాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తులుగా నివేదికను పోలీసులకు వివరించి ఫిర్యాదు చేశారు. దీంతో పంతుల సత్యన్న, గోవర్ధన్, మండ్ల అంజి, దేవరకద్ర అంజన్న అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టిప్పర్ పట్టివేత...

మద్దూర్(ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్టు మద్దూర్ ఎస్ఐ విజయ్‌కుమార్ వెల్లడించారు. కోయిలకొండ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా శనివారం రాత్రి మద్దూర్‌కు ఇసుకను తరలిస్తున్నట్టు అంది న విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. మ ద్దూర్ శివారులో టిప్పర్‌ను పట్టుకొని విచారించగా దుప్పడ్‌గట్టు గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి ఇసుకను తరలిస్తున్నట్టు గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి యజమాని శ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు ట్రాక్టర్లు సీజ్



అదుపులోకి తీసుకున్న ఇసుక ట్రాక్టర్లు

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఆత్మకూర్ ఎస్ఐ నరేందర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి సురేందర్‌తో పాటు వేణు అనే కానిస్టేబుళ్లు డ్యూటీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తిప్పడంపల్లి వాగు నుంచి రెండు ఇసుక ట్రాక్టర్లు రావడంతో నిలిపివేశారు. అనుమతులు లేవని డ్రైవర్లు గొల్ల నవీన్, బుడగ జంగం శేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆత్మకూరు ఠాణాకు ట్రాక్టర్లను తరలించి వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

అల్లీపూర్‌లో 150 గ్రాముల ఆల్ఫ్రాజోలం పట్టివేత?

బిజినేపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కల్తీకల్లు తయారీకి వినియోగించే అల్ఫ్రాజోలం అనే రసాయన పదార్థంను అక్రమంగా తెచ్చి వినియోగిస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం ఎక్సైజ్‌శాఖ స్పెషల్ టీం అధికారులు దాడులు చేపట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని అల్లీపూర్ గ్రామంలో150 గ్రాముల అల్ఫ్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మహేష్ గౌడ్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. కాగా, అల్లీపూర్ గ్రామంలో ఈ మధ్యకాలంలో విచ్చలవిడిగా కల్తీకల్లు తయారు చేయడంతో మత్తు కోసం చుట్టుపక్కల గ్రామస్థులు సైతం కల్లు దుకాణానికి వెళ్లి కల్లు తాగేందుకు అలవాటు పడ్డారు. దీంతో కల్తీకల్లు తయారీలో అల్ఫ్రాజోలం వినియోగం పెరగడంతో చాలా మంది కల్లు లేకపోతే బతకలేమన్న పరిస్థితికి వచ్చారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అల్ఫ్రాజోలం ఎక్కడి నుంచి సరఫరా అవుతుందో గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అందరికీ అందుబాటులో సీతాఫలం

▸▸ గ్రామీణులకు జీవనోపాధి కల్పిస్తున్న సీజనల్ పండ్లు

▸▸ అచ్చంపేట పట్టణంలో జోరుగా విక్రయాలు



లింగాల చౌరస్తాలో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న సీతాఫలం బుట్టలు

అచ్చంపేట టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు పల్లెల్లో ఉదయాన్నే బుట్టలో పెట్టుకొని సైకిళ్ల మీద తిరుగుతూ సీతఫలాలు అమ్మేవారు, గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు చుట్టూ ఉండే అడవులు గుట్టలకు వెళ్లి కాయలు తెచ్చి మాగేయడం.. అవి పండాయో లేదో అని చూసుకోవడం జరిగేది. మొత్తం ఈ కాలమంతా ఇంటిల్లిపాదికీ సీతాఫలమే అల్పాహారం. ఈ పండ్లలోనే అధిక పోషకాలున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఎంతో మంది పేదలకు 45 రోజుల పాటు ఆర్థికంగా జీవనోపాధి కల్పించేవి. నల్లమల నుంచి గిరిజనులు సీతఫలాలను తీసుకువచ్చి పట్టణంలో తిరిగి అమ్ముతూ ఉపాధి పొందుతున్నారు.

వానకాలం అంటేనే గుర్తుకు వచ్చే పండ్లు సీతాఫలాలు. ఈ పండ్లు సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్‌లో ఎక్కడ చూసినా అవే దర్శనమిస్తున్నాయి. గత నాలుగేళ్లుగా అదునులో వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో ఈసారి కూడా చెట్లు విరగకాశాయి. జిల్లాలోని నల్లమల ప్రాంతంలోని అడవులలో దండిగా లభిస్తాయి. ఈ అడవులలో ప్రధానంగా అప్పాయిపల్లి, అంబగిరి, చెన్నంపల్లి, సిద్దాపూర్, మన్ననూర్‌తో పాటు అడవి ప్రాంతంలో లభించే సీతాఫలాలు రుచిగా ఉండడంతో పాటు పుష్కలంగా ఔషధగుణాలు కలిగి ఉంటాయి. వారం, పదిరోజుల నుంచి సీతాఫలాలు మార్కెట్‌కు రావడం ప్రారంభమైంది. ప్రతీ ఏటా సీతాకాలంలో వచ్చే లాభాలు మిగతా పండ్ల కంటే కొంత ఎక్కువనే చెప్పుకోవాలి.

ధర కూడా తక్కువగా ఉండటం ఆపిల్‌కు దీటుగా ఇందులో పోషకాలు ఉండడంతో ఈ ఫలాన్ని పేదోడి యాపిల్‌గా భావిస్తారు. ఈ ఫలాలు కేవలం సెప్టెంబరు నుంచి నవంబరు మాసంలో మాత్రమే ఎక్కువగా అందుబాటులో ఉంటాయి. ఇతర రకాల పండ్లు త్వరగా మాగేందుకు కొన్ని రకాల రసాయనాలను వాడుతుంటారు.

కానీ, సీతాఫలాలు ఎలాంటి రసాయనాలు లేకుండా సహజంగా పండుతాయి. కాయపండు సైజును బట్టి ధర నిర్ణయిస్తారు.

ఈ పండ్లకు వారికి వారే ధర నిర్ణయించుకోవచ్చు. ఒక్క బుట్ట దాదాపు రూ.600 నుంచి 800 వరకు వెచ్చిస్తారు. జిల్లా వ్యాప్తంగా అడవులు ఎక్కువగా ఉండటంతో పండ్లు విరివిగా లభిస్తాయి.

చిలకముట్టిన పండు మస్తు రుచి



చెట్టుమీద ఉన్న కాయల కన్నా చిలకముట్టిన పండు భలే రుచిగా ఉంటుంది. వాటి కోసం చాలా వెతుకుతాం. నల్లమలలోని అప్పాయిపల్లి, అంబగిరి అడవులకు వెళ్లి తీసుకువస్తాం. కోతుల బెడదతో చాలా తక్కువగా దొరుకుతాయి. ఒక గంప అమ్మితే రూ. 600 నుంచి రూ.800 వరకు వస్తాయి.

- చంద్రమ్మ, అప్పాయిపల్లి

అడవికి వెళ్తే.. పండ్లు బాగా దొరుకుతాయి



ప్రతీ రోజు గ్రామ సమీపంలోని గుట్టల వెంట అడవులకు వెళ్తే విరివిగా సీతాఫలాలు లభిస్తాయి. వాటికి అచ్చంపేటకు తీసుకెళ్లి విక్రయిస్తే రూ.400 నుంచి రూ. 500 వరకు అమ్ముడుపోతాయి. ఇలా సీజన్ మొత్తంతో సుమారు 40 రోజులు అమ్ముతాం.

- రాములమ్మ, అచ్చంపేట

శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

▸▸ ఎనిమిది గేట్లు ఎత్తి 2.22లక్షల క్యూసెక్కుల నీరు విడుదల

గద్వాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. శనివారం శ్రీశైలం జలాశయానికి 2.96 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. దీంతో ప్రాజెక్టు ఎనిమిది గేట్లను తెరిచి 2,22,032 క్యూసెక్కులను కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 65,890 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215టీఎంసీలు కాగా ప్రస్తుతం 211.47 టీఎంసీల నిల్వకు చేరుకున్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 20వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 30వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, నాలుగే గేట్ల ద్వారా, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 19వేల క్యూసెక్కులు అవుట్‌ఫ్లో ఉంది. భీమా నది నుంచి సన్నతి బ్యారేజీకి ఇన్‌ఫ్లో 3లక్షల క్యూసెక్కులు ఉండగా అవుట్‌ఫ్లో 3లక్షల క్యూసెక్కుల నీరు విడుదలై జూరాలకు వస్తుంది.

ప్రస్తుతం జూరాలకు 2.39 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 31 గేట్లను ఎత్తి 2.14లక్షల క్యూసెక్కులు విద్యుత్ ఉత్పత్తి ద్వారా 28,734 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి సుంకేసులకు 15వేలు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో 12వేల క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలశయానికి విడుదల చేస్తున్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాలు నివారించవచ్చు

▸▸ టీజీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ పి.వెంకటరమేష్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈ పి.వెంకటరమేష్

పాలమూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలను రైతులు, ప్రజలు, విద్యుత్ సిబ్బంది అప్రమత్తతోనే నివారించవచ్చని టీజీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ పి.వెంకటరమేష్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్‌లో ఏపీటీఎస్ విజిలెన్స్, విద్యుత్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరై ప్రసంగించారు.

విజిలెన్స్ శాఖ సిబ్బంది నుంచి సహకారంతోనే విద్యుత్ శాఖకు అక్రమ విద్యుత్ వాడకం తగ్గించగలుగుతున్నామని తెలిపారు. విజిలెన్స్ సీఐ డి.కె.మహేశ్వరరావు, ఎస్ఐ కె.మదన్‌మోహన్, డీఈ డి.లక్ష్మణ్‌నాయక్, ఏడీలు తౌర్యానాయక్, రవిప్రసాద్, సంతోష్‌కుమార్, ఏఈలు వెంకటేష్, ప్రసన్నకుమార్, అంబికలు సిబ్బందికి పలు సందేహాలను నివృత్తి చేశారు. ప్రధానంగా ప్రమాదాలకు కారణమవుతున్న ఎల్‌సీలు, 11కేవీ, 22 కేవీ విద్యుత్ సరఫరా, అంతరాయం సరిచేయటంలో చేస్తున్న పొరపాట్లను వివరించారు. లైన్‌క్లియర్(ఎల్.సి) తీసుకున్న వ్యక్తి తన కోడ్‌భాష(నాలుగు అక్షరాలు)లో సమాచారం ఇవ్వటం, ఎల్.సి. తిరిగి ఇవ్వటంలో అజాగ్రత్తల వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. లాగ్‌బుక్‌లో ఎల్.సి. అనేది తప్పకుండా ఎంట్రీ చేయాలన్నారు. విద్యుత్ సంస్థ ఇచ్చిన ప్లాస్టిక్ గ్లౌజులు, ఎర్త్‌రాడ్, లాగ్‌బుక్‌లో ఎంట్రీ చేయటంతో తప్పకుండా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వాటిని ఉపయోగించటం నామోషీగా ఫీలు కారాదన్నారు. సిబ్బంది ముస్తాక్, ఇమ్రాన్, గంగాధర్‌లు పాల్గొన్నారు.

దినసరి వేతన కూలీలను పర్మినెంట్ చేయాలి

▸▸ వంటావార్పుతో కార్మికుల నిరసన



వంటావార్పు నిర్వహించి నిరసన తెలుపుతున్న కార్మికులు

కొల్లాపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టళ్లలో పని చేస్తున్న రోజు వారి వేతన కార్మి కులను పర్మినెంట్ చేయాలం టూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శనివారం కొల్లాపూర్ పట్టణంలో వంటావార్పు చేసి నిరసన తెలిపారు. మండల కేంద్రంలో ఎస్టీ బాలుర హాస్టల్‌లో కార్మికులు వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివవర్మ మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పని చేస్తున్న వర్కర్లను పర్మినెంట్ చేయాలని, జీవో నెం. 64ను నిలిపివే యాలని పాత పద్ధతిలోనే కలెక్టర్ గెజిట్ ప్రకా రం వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కన్వీనర్ ఎండీ సలీం, యూనియన్ రాష్ట్ర నాయకులు దామోదర్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, యూనియన్ నాయకులు శారదమనిబాలస్వామి, రమణమ్మ, పార్వత మ్మ, సాయికుమార్, శారదమని, ఉషమ్మ, రంగమ్మ, ఉసమ్మ, చెన్నమ్మ, లక్ష్మి, చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి చేరుకున్న అదృశ్యమైన వ్యక్తి



పోలీసులతో రాములు

నవాబ్‌పేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నవాబ్‌పేట మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన రాములు ఈ నెల 16న ఇంటినుంచి వెళ్లి ఎంతకూ రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పెద్ద కుమారుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ విక్రం కేసు నమోదు చేసి తన సిబ్బంది కలిసి విచారణ వేగవంతం చేశారు. శనివారం సాయంత్రం రాములు జిల్లా కేంద్రం నుంచి బోయపల్లి వైపు నడుచుకుంటూ వస్తుండటంతో గమనించిన స్థానికులు నవాబ్‌పేట పోలీసులకు, ఆయన పెద్ద కొడుకుకు సమాచారం ఇచ్చారు. వెంటనే రాములును అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

▸▸ కలెక్టరేట్ ముట్టడిలో జిల్లా గ్రంథాలయ, అలంపూర్ మార్కెట్‌యార్డ్ చైర్మన్లు



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న జిల్లా గ్రంథాలయ, అలంపూర్ మార్కెట్‌యార్డ్ చైర్మన్లు

గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దినోత్సవంలో ప్రోటోకాల్ పాటించకుండా తమను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలిశ్రీనివాసులు, అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెప్టెంబరు 17న ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రతినిధి ఎ.పి. జితేందర్‌రెడ్డి కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. ఆ కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ బీఎం సంతోష్‌తో పాటు గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోతో పాటు గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ కూడా వేదికపై కూర్చున్నారు. దీంతో మాకు ప్రోటోకాల్ లేదా అని కలెక్టర్‌ను అడిగేందుకు వెళ్లగా గద్వాల ఎమ్మెల్యే మాపై దుర్భాషలాడారన్నారు. అలాగే అదనపు కలెక్టర్ సీసీ, కొందరు పోలీసులు మమ్మల్ని లాక్కెళ్లారని, వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేదికపై కూర్చోవడం మాకు కూడా సంతోషమేనని, ఎందుకంటే అతడు కూడా ఒక బీసీ బిడ్డే అన్నారు. అయితే మాకు కూడా వేదికపై కూర్చోనివ్వకుండా కిందిస్థాయిలో కూర్చోనివ్వడంతో మా మానోభావాలు దెబ్బతిన్నాయని, అందుకే కలెక్టర్‌ను అడిగేందుకు వచ్చామే తప్ప ఇందులో ఎలాంటి వేరే అభిప్రాయాలు లేవన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే, అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షెక్షావళి ఆచారి, ఎస్సీ సెల్ నాయకులు మద్దిలేటి, ఎర్రవల్లి మాజీ సర్పంచు జోగుల రవి ఉన్నారు.

ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు

ప్రోటోకాల్ రగడలో రెవెన్యూ, పోలీస్ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గద్వాల జిల్లా కేంద్రంలో ఈ నెల 17న జరిగిన ప్రజాపాలన దినోత్సవాల సందర్భంగా ప్రజాప్రతినిధుల ప్రోటోకాల్ రగడలో కొందరు ప్రజాప్రతినిదులపై దురుసుగా ప్రవర్తించిన అదనపు కలెక్టర్ సీసీ రాఘవేంద్ర గౌడు, కేటిదొడ్డి పీసీ మల్లేష్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు సంబంధిత అధికారుల జీవో కాపీలు సోషల్‌మీడియాలో వెలువడ్డాయి.

అలంపూర్ నుంచి మహారాష్ట్రకు అఖండ జ్యోతి



అఖండ జ్యోతిని పాదయాత్రగా తీసుకెళ్తున్న మండలి సభ్యులు

అలంపూర్ సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని ఐదో శక్తిపీఠమైన జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయం నుంచి అఖండ జ్యోతిని మహారాష్ట్రలోని సోలాపూర్‌కు శనివారం తీసుకువెళ్తున్నారు. దేశం సుభిక్షంగా ఉండాలని మహారాష్ట్రంలోని సోలాపూర్‌కు చెందిన సిద్దేశ్వర మహారాజ్ నవరాత్రుల మండలి ఆధ్వర్యంలో దేశం నలుమూలలా ఉన్న శక్తిపీఠాల నుంచి అఖండ జ్యోతులను తీసుకునివెళ్లి సోలాపూర్‌లో పూజలు నిర్వహించనున్నట్లు మండలి సభ్యులు తెలిపారు. అందులో భాగంగానే ఐదో శక్తి పీఠమైన జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయం నుంచి పాదయాత్రగా అఖండ జ్యోతిని తీసుకెళ్తున్నట్లు సభ్యులు తెలిపారు.

ముస్లిం మైనారిటీల సమస్యలు పరిష్కరించాలి

▸▸ ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జబ్బార్



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు

వనపర్తి టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీ కుటుంబాలు స్థితిగతులపై ఆవాజ్ ఆధ్వర్యంలో సర్వే చేసినట్లు తెలిపారు. చాలా వరకు ముస్లిం కుటుంబాలు కడుపేదరికంలో జీవనం కొనసాగిస్తున్నారని గుర్తించినట్లు తెలిపారు. అనంతరం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అఫ్జల్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎండీ ఖాజా, గయాసొద్దిన్, ఖలీల్, అబ్దుల్ హుస్సేన్, భద్రోద్దిన్, ఫయాజ్, నాజీయా కౌసర్, రంజాద్, చాంద్ పాష, లతీఫ్ పాల్గొన్నారు.

ఎస్ఎల్‌టీఏ టీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ టీఎస్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అక్టోబరులో రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కన్వీనర్లు గోపాల్, చిన్నయ్యలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆదివారం నుంచి జిల్లాల స్థాయిలో ఆరో తరగతి నుంచి పదవ తరగతి చదివే విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలు పాఠశాలల్లో నిర్వహించి అక్కడ ఎంపికైన విద్యార్థులను ప్రతీ జిల్లా నుంచి ఐదుగురిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వీరికి రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం కల్పిస్తారని తెలిపారు. ఈ వ్యాసాలలో 11 మంది కవుల గురించి రాయల్సి ఉంటుందన్నారు బమ్మెర పోతన, దాశరథి కృష్ణమాచర్య, సుద్దాల హన్మంతు, వట్టికోట ఆళ్వార్‌స్వామి, వానమామలై వరదచార్యులు, సురవరం ప్రతాప్‌రెడ్డి, సామల సదాశివ, బోయజంగయ్య, పాకాల యశోదరెడ్డి, కాళోజీ నారాయణరావు, డాక్టర్ సీ నారాయణ రెడ్డి గురించి పాఠశాల స్థాయిలో వ్యాసాలు రాయాల్సి ఉంటుందన్నారు.

న్యూస్ బాక్స్

బస్సు చార్జీలు పెంచొద్దు

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : హిందువుల పర్వదినాలకు ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచకుండా చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు శనివారం ఆర్ఎం సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. చార్జీల పెంపుతో సామాన్యులపై అదనపు భారం పడుతోందన్నారు. రోజు వారిగా అదనపు బస్సులకు అవే ఖర్చు వస్తాయని, ఎందుకు చార్జీలు పెంచుతారని ప్రశ్నించారు. వీహెచ్‌పీ నాయకులు నాగరాజు, హనుమంతు ఉన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

జడ్చర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలో డీటీసీపీ లేఅవుట్‌లతో ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వెంచర్లపై చర్యలు తీసుకోవాలని శనివారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి వినతిపత్రం అందజేశాడు. లేఅవుట్‌లలో రోడ్లు, డ్రైనేజీలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, పార్కులు నిర్మించకుండా మోసం చేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలన్నారు.

కొనసాగిన ధాన్యం కొనుగోలు

దేవరకద్ర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర మార్కెట్‌కు శనివారం రైతులు ధాన్యం విక్రయిం చేందుకు తీసుకొచ్చారు. హంస 28 క్వింటాళ్లు రాగా, గరిష్ఠంగా రూ.1,809, కనిష్ఠంగా రూ.1,741 పలికినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

గోశాల ఏర్పాటుకు దాతలు సహకరించాలి

దేవరకద్ర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయం నందు గోశాల ఏర్పాటుకు దాతలు సహకరించాలని ఆలయ చైర్మన్ బీసు నరసింహరెడ్డి అన్నారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయానికి సంబంధించి రూ.11 లక్షలు ఉండగా, గోశాల ఏర్పాటు పెద్దల సమక్షంలో నిర్ణయించారు. దసరా పండుగ రోజు గోశాల ఏర్పాటుకు భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. ఆలయ పూజరి నాగరాజు, నాగభూషన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

నవాబ్‌పేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని యన్మనగండ్ల బీసీ కళాశాల వసతి గృహన్ని శనివారం తనిఖీ చేసి, విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అద్దె భవనంలో వసతి గృహం కొనసాగడంతో అక్కడక్కడ మరమ్మతులు చేయించాలని యజమానికి సూచించగా, సెలవుల్లో చేయిస్తానన్నారు.

మైసమ్మ ఉత్సవాలకు ఆహ్వానం

నవాబ్‌పేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొల్లూర్ గ్రా మంలో ఈ నెల 22న నిర్వహించే మైసమ్మ ఉత్సవాలకు రావాలని కోరుతూ శనివారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీ.లక్ష్మారెడ్డిని గ్రామ బీఆర్ఎస్ నాయకులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు చందర్‌నాయక్, వెంకట్‌రావు, రఘుగౌడ్ ఉన్నారు.

కళాభవన్ స్థలం రక్షణ అందరి బాధ్యత

పాలమూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని డా.బీఆర్ అంబేడ్కర్ కళా భవన్‌ను రక్షించటం అందరి బాధ్యతని డా.బీఆర్ అంబేడ్కర్ కళాభవన్ పరిరక్షణ సమితి ప్రతినిధుడు పరమేశ్వర్ అన్నారు. శనివారం కాంగ్రెస్ నాయకుడు సురేందర్‌రెడ్డిని కలిసి మద్దతు కోరారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళా భవనంలో ఉర్దూఘర్ నిర్మాణం తక్షణమే నిలిపివేయాలని కోరారు. కేవలం సాంస్కృతిక కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించుకోవటానికి మాత్రమే అవకాశం ఉండాలన్నారు. పాతూరి రమేష్, ఎర్రం నరసింహులు, మురళి, సంజీవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

మిడ్జిల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దోనూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే విధంగా క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు దాత సుధాకర్‌గౌడ్ స్కూల్ బ్యాగులు అందజేశారు. మండల ఉత్తమ ఉపాధ్యాయుడు కృష్ణానాయక్‌ను సన్మానించారు. హెచ్ఎం తారాసింగ్, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, కృష్ణ పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు

మహమ్మదాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో సామాజిక స్పృహ, దేశభద్రతపై అవగాహన కల్పించేందుకే కేఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు నిర్వహించామని పరిగి బీజేపీ కౌన్సిల్ మెంబర్ కుర్వకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు సేవాదివాస్ సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

గ్రామ అభివృద్ధే లక్ష్యం

మిడ్జిల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాభివృద్ధే లక్ష్యంగా బ్లాక్ స్థాయి మాస్టర్ ట్రైనర్స్, మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ నిర్వహించినట్లు ఎంపీడీవో గీతాంజలి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆది కర్మయోగి గ్రామంగా మంగళిగడ్డతండా ఎంపిక కావడంతో జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన అధికారులతో మాస్టర్ ట్రైనర్స్, బ్లాక్ మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ ఇచ్చారు.



భూత్పూర్ సాహితీ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



జడ్పీహెచ్ఎస్ బోయపల్లి పాఠశాలలో..

పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు

» ఆడిపాడిన విద్యార్థులు, ఉపాధ్యాయులు » సమీప చెరువుల్లో నిమజ్జనం



న్యూరిషి స్కూల్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ భూత్పూర్/దేవరకద్ర/మిడ్జిల్/గండీడ్/హన్వాడ/జడ్చర్ల/నవాబ్‌పేట/మూసాపేట/చిన్నచింతకుంట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని న్యూరిషి పాఠశాలలో బతుకమ్మ సంబురాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతకమ్మను తయారు చేసి ఆడిపాడారు. డైరెక్టర్ పూజితామోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఇన్‌చార్జి మాలతి పాల్గొన్నారు. మహ్మదాబాద్ మండలం నంచర్ల గేట్‌లోగల అక్షర పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భూత్పూర్ మునిసిపాలిటీ కేంద్రంలోని సాహితి కాన్సెప్ట్ పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు మునిసిపల్ మాజీ చైర్మన్ బస్వరాజుగౌడ్ పాల్గొనగా, విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలు తయారు చేసి ఆడిపాడారు. పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు. దేవరకద్ర మండల కేంద్రంతో పాటు మిడ్జిల్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్, చైతన్యభారతి, సెయింట్‌మెరిస్, కేజీబీవీ, రాణిపేట్ సెయింట్‌మెరిస్, అయ్యవారిపల్లి, వస్పుల జడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. గండీడ్ మండలం చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాల, హన్వాడ మండలం లింగన్నపల్లి, ఇబ్రహింబాద్, హన్వాడ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. జడ్చర్ల మండలం కోడ్గల్ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థినులు సాంప్రదాయ వస్త్రధారణలో బతుకమ్మ ఆడారు. అనంతరం సమీపంలోని దుందుబీనదిలో నిమజ్జనం చేశారు. నవాబ్‌పేట మండల కేంద్రంలో నవాబ్‌పేటలో బతుకమ్మ ఊరేగింపు చేపట్టగా, లింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. అడ్డాకుల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో, చిన్నచింతకుంట మండల కేంద్రంలోని సాందీప పాఠశాల ఆవరణలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు.



కోడ్గల్‌లో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న విద్యార్థినులు

మహిళల అభివృద్ధే లక్ష్యం

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



మహిళా సంఘం భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని 20వ వార్డు ఎంప్లాయిస్‌కాలనీలో రూ.22 లక్షల ముడా నిధులతో చేపట్టనున్న మహిళా సంఘాల భవనాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి, మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో పావలావడ్డీ బకాయిలు విడుదల చేశామని గుర్తుచేశారు. మహిళల పేరిటే అన్ని పథకాలు అమలుచేస్తున్నామని, ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మహిళలంతా అండగా ఉండాలని కోరారు. అంతకు ముందు అప్పన్నపల్లిలో రూ.10 లక్షల ముడా నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు షబీర్‌అలీ, సిరాజ్‌ఖాద్రీ, అంజద్, ఖాజాపాష, రాషేద్‌ఖాన్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : విద్యాభివృద్ధికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్రౌన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమానికి పాల్గొని, మాట్లాడారు. పలువురు ఉపాధ్యాయులకు, పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ఎస్.ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంచందర్‌జీ పాల్గొన్నారు.

గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందుకున్న అధికారులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/నవాబ్‌పేట/హన్వాడ/మహమ్మదాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ఆదికర్మ యోగి కార్యక్రమం రూపొందించడం జరిగిందని ఎంపీడీవో కరుణశ్రీరెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆదికర్మ యోగి శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి దర్తీ ఆబా జన గ్రామీణ ఉత్కర్ష్ పథకం ద్వారా ఎంపిక చేసిన గిరిజన గ్రామాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పర్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతందన్నారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన గ్రామాల సభ్యులకు శిక్షణ ఇచ్చారు. నవాబ్‌పేట మండలంలోని వివిధ గిరిజన తండాల్లో నిర్వహించిన ఆది కర్మయోగి కార్యక్రమం శనివారంతో ముగిసినట్లు ఎంపీడీవో జయరాములు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రతిజ్ఞ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శమీఉల్లా పాల్గొన్నారు. హన్వాడ మండల కేంద్రంలో తహసీల్దార్ కిష్యానాయక్, ఎంపీడీవో యశోద ఆది కర్మయోగి ముగింపు సందర్భంగా ఎంపికైన అమ్మాపూర్, అయోధ్యనగర్ గ్రామాల అధికారులకు శిక్షణ ఇచ్చారు. గిరిజనులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి వారి జీవన ప్రమాణాలను పెంచడానికే ఆది కర్మయోగి కార్యక్రమాన్ని ప్రారంభించారని గిరిజన సంక్షేమ శాఖ మాస్టర్ ట్రైనర్ పద్మ అన్నారు. మహమ్మదాబా ద్ మండలంలో శనివారం ముగిసిన ఆది కర్మయోగి శిక్షణకు ఆమె పాల్గొని, మాట్లాడారు. ఎంపీహెచ్ పద్మమ్మ, ఏపీవో హరిశ్చంద్రుడు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషకాహారం

మూసాపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందిపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారం కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణు లు, బాలింతలు తీసుకోవల్సిన పోషకాహారం గురించి వివరించారు. అదే విధంగా బతుకమ్మ సంబురాలను సైతం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు లక్ష్మీదేవమ్మ, సంధ్యారాణి, సత్తయ్య, శివకుమార్, రాజు, అంగన్‌వాడీ కార్యకర్త వెంకటమ్మ, సిబ్బంది రేవతమ్మ తదితరులు ఉన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

మహమ్మదాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగితే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని మహమ్మదాబాద్ ప్రాథమిక పాఠశాల నెంబర్ 2 ప్రధానోపాధ్యాయురాలు ఇందిర అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థులు గురువులను శాలువాలతో సన్మానించి, ఘనంగా గురుపూ జోత్సవాన్ని జరుపుకున్నారు.

రవిప్రకాశ్‌కు సరస్వతీ విద్యాభూషన్ అవార్డు

మూసాపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన మూసాపేట మోడల్ స్కూల్ కరస్పాండెంట్ నామాల రవిప్రకాశ్‌కు ట్రస్మా ఆధ్వర్యంలో సరస్వతీ విద్యాభూషన్ అవార్డు పొందారు. ఈ అవార్డును ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ట్రస్మా ప్రాంత అధ్యక్షుడు ఎస్ఎన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అదే విధంగా మూసాపేట మోడల్ స్కూల్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్.రాధిక, నందిని ఎంపికయ్యారు.

ఎస్టీ హోదా తొలగించొద్దని వినతి

మిడ్జిల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బంజారా, లంబాడా హక్కులను రక్షించాలని, ఎస్టీ (గిరిజన) జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలను నిలిపివేయాలని గిరిజన విద్యార్థి సంఘం, ఎస్టీసెల్‌తో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు శనివారం తహసీల్దార్ యూపీ రాజుకు వినతిపత్రం అందజేశారు. బంజారా కమ్యూనిటీ గిరిజన హోదాతో విద్య, ఉపాధి, సామాజిక రంగాల్లో ముందుకు సాగుతోందని, ఈ హోదాను తొలగించాలన్న ప్రయత్నాలు తమకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌పవర్, బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి విజయ్‌రాథోడ్, కాంగ్రెస్ నాయకుడు సీతారంనాయక్ అన్నారు. నాయకులు తిరుపతినాయక్, రమేష్ నాయక్, గోపినాయక్, మధునాయక్, లక్ష్మణ్‌నాయక్, శ్రీనునాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

నిజాముద్దీన్ మృతదేహాన్ని
తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం

» ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



నిజాముద్దీన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అమెరికా పోలీసు కాల్పుల్లో మరణించిన పాలమూరు వాసి నిజాముద్దీన్ పార్థీవదేహాన్ని పాలమూరుకు తీసుకొచ్చేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం బీకేరెడ్డి కాలనీలోని మృతుడి కుటుంబ సభ్యులను ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శించారు. ఇప్పటికే విదేశీ వ్యవహారాల శాఖ అధికారులతో మాట్లాడటం జరిగిందని, ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ కమిటీకి లేఖ రాయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారిని కూడా నియమించిందన్నారు. వీలైనంత త్వరగా నిజాముద్దీన్ మృతదేహాన్ని భారత్‌కు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. మృతదేహాన్ని ఇండియాకు తీసుకొచ్చేందుకు ఖర్చు భరించలేమని తల్లిదండ్రులు చెప్పడంతో ప్రభుత్వమే ఖర్చులు భరించేలా మాట్లాడతానన్నారు. జరిగిన ఘటనపై పారదర్శక విచారణ జరిపించి అన్ని అనుమానాలను నివృత్తి చేయాలని ఎమ్మెల్యే యెన్నం కోరారు. వీలైనంత త్వరగా నిజాముద్దీన్ మృతదేహాన్ని పాలమూరుకు తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం రాత్రి బీకేరెడ్డికాలనీలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అమెరికాలోని తెలుగు అసోసియేషన్, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ నేతలను ఫోన్‌లో సంప్రదించారు. మృతదేహం తరలింపు అయ్యే ఖర్చు తనతోపాటు బీఆర్ఎస్ నాయకులు భరిస్తామని, రేపు మధ్యాహ్నం వరకు అవసరమైన మొత్తం డబ్బులు జమ చేసి డీడీ పంపించడం జరుగుతుందన్నారు. పరామర్శించిన వారిలో తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, అబ్దుల్ రహమాన్, మక్బూల్, జావెద్‌బేగ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.3.94 కోట్ల వేరుశనగ విత్తనాలు

జడ్చర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నూనెవిత్తుల అభివృద్ధి పథకంలో భాగంగా నియోజకవర్గంలోని 5,475 ఎకరాలకు రూ.3.94 కోట్ల విలువైన వేరుశనగ విత్తనాలను ఉచితంగా అందచేయనున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో రైతుకు ఎకరానికి 60 కిలోల చొప్పున విత్తనాలు అందచేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా నియోజకవర్గంలోని రైతులకు 40శాతం సబ్సిడీతో 1029 యంత్ర పరికరాలను అందించనున్నట్లు తెలిపారు. పథకం వివరాలను ఏవోలను సంప్రదించాలని కోరారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 5475 ఎకరాలు (2190) హెక్టార్లుకు వేరుశనగ సాగుకోసం ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. జడ్చర్ల, మిడ్జిల్, నవాబ్‌పేట మండలాల్లో 500 హెక్టార్లు, ఊర్కొండ మండలానికి 600 హెక్టార్లు, బాలానగర్ మండలానికి 60 హెక్టార్లు, రాజాపూర్ మండలానికి 30 హెక్టార్ల చొప్పున ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

రేపు బాలుర కళాశాలలో దసరా ఉత్సవాలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవ కమిటీ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షురాలు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనితరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సుశృత ప్రజా వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఉదయం 10 నుంచి 4 గంటల వరకు జరిగే ఉత్సవాల్లో పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బెక్కం జనార్దన్, ఆర్గనైజింగ్ సెక్రెటరి కురుమూర్తి, ప్రశాంత్ పాల్గొన్నారు.

తితిదే కళ్యాణ మండపంలో హస్తకళా మేళా



హస్తకళా మేళాలో వినియోగదారుల సందడి

పాలమూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో కొనసాగుతున్న కళాసిల్క్ చేనేత హస్తకళా మేళా ఆకట్టుకుంటోంది. ఇటీవల ప్రారంభమైన ఈ కార్యక్రమానికి నగరవాసుల నుంచి మంచి స్పందన వస్తోంది. నిర్వాహకులు సంజయ్ జైన్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికీ చేతికళలను ఆదరించడం గొప్ప సాంప్రదాయం అన్నారు. చేనేత వస్త్రాలు, గృహోపకరణాలు, ఆభరణాలు, ఆటవస్తువులు, తినుబండారాలు ఏర్పాటు చేశామన్నారు. మేనేజర్ బీజు మండల్ మాట్లాడుతూ రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈనెల 30వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని వివరించారు.

అర్హులు సద్వినియోగం చేసుకోవాలి

భూత్పూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి స్వానిధి పథకాన్ని అర్హులైన ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం మునిసిపాలిటీ కేంద్రంలో ఆర్పీలకు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. వీధి వ్యాపారాలు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకొని పొట్టపోసుకుంటున్న వారికి ప్రభుత్వం స్వానిధి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం గురించి స్థానికంగా ఉన్న వారికి వివరించేందుకు ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు లోక్ కళ్యాణ్ మేళా కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నురూల్ నజీబ్, మండల వైద్యాధికారి అబ్దుల్ రబ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా ఇవ్వాలి

చిన్నచింతకుంట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రైతులందరికీ యూరియా ఇవ్వాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం తహసీల్దార్ ఎల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. యూరియా ఇవ్వాలని ఇవ్వడంతో పాటు పత్తిపై ఎత్తి వేసిన దిగుమతి సుంఖాన్ని 11 శాతం తిరిగి విధించాలని, పత్తికి మద్దతు ధర రూ.10వేలు నిర్ణయించాలన్నారు. అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సీహెచ్ రామచందర్, జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డి, జిల్లా కార్యదర్శి నరసింహులు, కమిటీ మెంబర్లు అంజన్న, గోపాలు, బీడీ కార్మిక సంఘం నాయకుడు వెంకటేష్ పాల్గొన్నారు.

దేశ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం



ఇంజనీర్లను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్లు

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దేశ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు పేర్కొన్నారు. శనివారం టీచర్స్ కాలనీలోని రామాలయంలో నిర్వహించిన సీనియర్ సిటిజన్ ఫోరం కార్యవర్గ సమావేశంలో ఇంజనీరింగ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నేటి ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. అనంతరం పలువురు ఇంజనీర్లను ఫోరం సభ్యులు శాలువా, మెమెంటోతో సన్మానించారు. ఉపాధ్యక్షుడు రాజసింహుడు, ప్రధాన కార్యదర్శి నాగ భూషణం, గంగాధర్, అశోక్, కృష్ణుడు, నాగభూషణం, లక్ష్మణ్‌గౌడ్, రాములు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

మిడ్జిల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మహిళల ఆరోగ్య రక్షణ కోసం డాక్టర్ శివకాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సూర్య ఆధ్వర్యంలో 138 మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. రక్త నమూనాలు, స్పూటం నమూనాలు సేకరించి ల్యాబ్‌కి పంపించారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి ఆయుబ్‌ఖాన్, వైద్య సిబ్బంది సునంద, ప్రసాద్, దేవయ్య, జంగయ్య, శివకుమార్, ఉమ, సురేష్, పద్మజ, రాజేశ్వరి, జ్యోతి, తిరుపతమ్మ, గీత, చెన్నమ్మ, శారద పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలు విడుదల

మహబూబ్‌నగర్ న్యూటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడిలోని వాసవీ ఫంక్షన్‌హాల్‌లో శరన్నవరాత్రి ఉత్సవ కరపత్రాలు ఆవిష్కరించి, ఆలయ అర్చకుడు గొండ్యాల రాఘవేంద్రశర్మతో కలిసి మాట్లాడారు. సర్వ శక్తి స్వరూపులైన అమ్మవారిని 9 రోజుల పాటు పూజిస్తే మేలు కలుగుతందన్నారు. ప్రధాన కార్యదర్శి వేణుగో పాల్, కోశాధికారి నాగరాజు, ప్రమోద్‌కుమార్, చక్రధర గుప్తా, జానకిరాములు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

సామూహిక హనుమాన్ చాలీసా

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని దేవరకద్ర మండలం చౌదర్‌పల్లి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. హిందూ ఆలయాలు అన్యక్రాంతం కాకుండా కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విశ్వహిందూ పరిషత్ పాలమూరు జిల్లా కార్యదర్శి నాగరాజ్, విభాగ్ సత్సంగ్ ప్రముఖ్ రాచాల జనార్దన్, అశోక్‌సాగర్, చౌదరిపల్లి సత్సంగ్ ప్రముఖులు నాగరాజ్, జైపాల్‌రెడ్డి, శివకుమార్, ఆనంద్‌గౌడ్, శివారెడ్డి, జైపాల్‌రెడ్డి, కృష్ణ అంజి, అయ్యప్పస్వామి, రవికుమార్, రాజు, మల్లమ్మ, దేవరకద్ర మండల కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

పింఛన్ పెంచి ఇవ్వాలి



బండరుపల్లి గ్రామ పంచాయతీ వద్ద ఆందోళన చేస్తున్న పింఛన్‌దారులు

జడ్చర్ల/చిన్నచింతకుంట సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు, చేయూత పింఛన్ పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ శనివారం జడ్చర్ల మండలం పోలేపల్లి, చిన్నచింతకుంట మండలం బండరుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పింఛన్‌దారులు ముట్టడించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కందూరి యాదయ్య, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలపల్లి నరేందర్ మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.6 వేలు, చేయూత పింఛన్ రూ.4 వేలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టో పొందుపరిచిన విధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి భిక్షపతి మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివకుమార్ మాదిగ, దేవరకద్ర మండల అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.